రచన - నవంబర్ 1998

# ఆక్ట్రాయ్

మనిషి సంఘజీవి. సంఘంలో జీవిస్తూ ముడిగట్టుకొని కూర్చోవాలంటే కుదరదు. సామూహిక ప్రయోజనాల కోసమూ, అవసరాల కోసమూ ఆర్థిక బలంకల పాలనావ్యవస్థ ఉండాలి. అవే మన గ్రామ పంచాయితీలూ, పురపాలక సంఘాలూ, రాష్ట్ర ప్రభుత్వాలూ, కేంద్ర ప్రభుత్వాలూను. ఇవన్నీ కూడా రకరకాల పన్నుల్ని ప్రజల నుండి వసూలు చేస్తేనే కాని కోశాగారాలు నిండవు. పాలన అనేది జరగదు. ఈ రకరకాల పన్నుల్లో ఒకటి 'ఆక్ట్రాయ్' (OCTROI).

చుంగీ అనండి, లేదా ప్రవేశసుంకమనండి – పై ప్రాంతాల్లో తయారైన వస్తువులు నగర ప్రవేశం చేసేముందు, ఆయా వస్తువుల విలువను బట్టి కొంత శాతం నగరపాలక సంఘాలకి చెల్లించే రొక్కమని చెప్పుకోవాలి. మహానగరపాలక సంఘాలకి ఈ రకమైన పన్ను ద్వారా వచ్చే రాబడి చాలా ముఖ్యమైనదీ, ఎక్కువైనదీనూ. ఈ రాబడి తగ్గిపోతే నగరాభివృద్ధి పథకాలు కుంటుపడిపోతాయని నగరపాలకులు గోలపెట్టడం మనకు పరిచితమైన విషయమే. అందుచేత ఈ రాబడిని వృద్ధి చేసుకొనే ప్రయత్నంలో కూరగాయల బుట్టల దగ్గర్నుంచి అన్ని వ్యాపారవస్తువుల మీదనే కాకుండా, నగరంలోకి తీసుకురాబడే స్వంత గృహావసర వస్తువుల మీద కూడా ఈ సుంకాన్ని రుద్దేయడం జరుగుతుంది. కేంద్రానికి వెళ్ళే ఉత్పత్తి పన్నులూ, రాష్ట్రాలకి వెళ్ళే అమ్మకపు పన్నులూ కాక, నగర ప్రవేశంలో అదనంగా పడే ఈ చుంగీ కూడా వస్తువుల ధరల్ని పెంచేస్తుంది. వస్తువుల విలువని కూడా పెంచేస్తుంది.

అతి సుందరమైన బ్రహ్మపుత్ర లోయలోని ఓ ఊర్నించి నాకు, ఈ మహానగరం బదిలీ అయినప్పుడు, కలుషిత వాతావరణంలో కాలుపెట్టడానికి మనసంగీకరించక పోయినా, ఉద్యోగరీత్యా కదలక తప్పలేదు. సామాన్లనన్నింటినీ వీలైనంతగా పేక్ చేయించి లారీ కెక్కించి, నేనూ, శ్రీమతీ అస్సాం వదలి కలకత్తా మీదుగా ముంబయ్ జేరుకున్నాం. మా కివ్వాల్సిన క్వార్టర్ని ముంబయ్ నుంచి రాజమండ్రీ బదిలీ అయిన అసామీ ఖాళీ చేయకుండా, అసలు బదిలీనే ఆపుజేసుకొనే ప్రయత్నాల్లో ఉండడం వల్ల "ఇంకో వారం పది రోజుల్లో, మద్రాసు బదిలీ అయిన ఆఫీసరు ఖాళీ చేస్తున్న క్వార్టరు మీ కిస్తాం. అందాకా మీకు డ్రీమ్‌లాండ్ హోటల్లో రూం బుక్‌చేశాం," అన్నాడు ఎస్టేటు మేనేజరు. కాని మా కొలీగ్ బలవంతాన వాళ్ళ యింటికి తీసుకు పోయాడు..

నాకు క్వార్టరు దొరికిన మరుసటి రోజు, లారీ ముంబయ్ చేరినట్లు నగర శివార్ల నుంచి లారీ డ్రైవరు నేనిచ్చిన ఆఫీసు నెంబరుకి ఫోను చేశాడు. నేను కబురందుకొని, ఓ జూనియర్ కొలీగ్‌ని తోడుతీసుకొని ఆఫీసు జీప్‌లో 'ములంద్ చుంగీనాకా' (Octroi post) చేరుకొన్నాను. చుంగీనాకా కవతలగా ఉన్న లారీని, డ్రైవర్నీ గుర్తించాను.

అతనితో బాటు ఆఫీసు దగ్గరకు వెళ్ళాను. ఒకటో నెంబరు కిటికీ దగ్గరకు వెళ్ళి, రెండు రూపాయలు పెట్టి ఓ ఫారం కొన్నాను. అడిగిన వివరాలు ఒకటొకటిగా పూర్తిచేస్తూ, వస్తువుల విలువ దగ్గర సంఖ్య వేయబోతూండగా, లారీ డ్రైవరు చెయ్యి పట్టుకొని ఆపాడు. సరే, ఆ కాలం ఒక్కటీ వదిలి, మిగిలిన వివరాలు పూర్తిచేసి, సంతకం పెట్టి, కిటికీ నెంబరు రెండు దగ్గరకు వెళ్ళాను. ఆ ఫారంతోబాటు కింద పది రూపాయల నోటు పెట్టించాడు డ్రైవరు. ఆ కిటికీ వెనుకనున్న ఆసామి హస్తలాఘవంతో నోటుని యమస్పీడుగా జేబులో వేసుకొని, ఓ గులాబీ రంగు స్లిప్ మీద లారీ నంబరూ, తనిఖీచేసే ఇనస్పెక్టరు పేరు వ్రాసి నా కిస్తూ, "మీరు వెళ్ళి మీలారీ దగ్గరుండండి. 'సాల్వే' సాబ్ వచ్చి తనిఖీ చేస్తాడు," అన్నాడు.

లారీ దగ్గరకు వెడ్తూ, "పదెందుకు?" అని డ్రైవర్ని ప్రశ్నించాను.

"ఆ పదీ యివ్వకపోతే సాయంకాలం దాకా పడిగాపులు కాస్తూ కూర్చోవాలి. కిటికీ నెంబరు రెండు దగ్గర్నుంచి తనిఖీ యినస్పెక్టర్ సాల్వే సాబ్‌కి కబురందదు! ఇప్పుడు చూడండి, పది నిముషాల్లో ప్రత్యక్షమైతాడు!" అన్నాడు డ్రైవరు నవ్వుతూ.

అన్నట్టుగానే పది నిమిషాల కటూ యిటూగా తనిఖీ యినస్పెక్టర్ సాల్వే వచ్చాడు. అతని చేతిలో అంతకుముందు నేను పూర్తి చేసి యిచ్చిన ఫారం ఉంది. లారీలో ఉన్న సామాన్లకేసి చూశాడు. "టీ.వీ, ఫ్రిజ్‌లున్నాయా?" అని అడిగాడు.

"స్టీలు బీరువా, డైనింగ్ టేబిలూ, సోఫా సెట్లూ అవీ తీసుకొచ్చాను కాని, టీవీ, ఫ్రిజ్ ఇంతదూరం రోడ్డు ప్రయాణంలో పాడైపోతాయని అక్కడే తక్కువ ధరకి అమ్మేసి వచ్చాను" అన్నాను.

"మీ సామాన్లన్నీ కొత్తవిలా ఉన్నాయి. స్కూటర్ ఏ మోడల్?" సాల్వే ప్రశ్నించాడు.

"కొత్తవి కావు, కాని పదేళ్ళయింది. అస్సాంలో ఉప్పు గాలి లేదు. అందుకని సామాన్లు త్వరగా తుప్పు పట్టవు," అన్నాను.

"స్కూటర్ ఏ మోడలో చెప్పారు కాదు" అన్నాడు సాల్వే అదోలా చూస్తూ.

"ఇది కొత్తది కాదు, కాని ఆరేళ్ళయింది" అన్నాను.

"చాలా పేకేజి పెట్లున్నాయి, అవన్నీ ఏమిటి?"

"స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలూ, పుస్తకాలూ వగైరా".

"అయితే స్టీలు సామాను చాలానే ఉన్నట్టుంది?" అన్నాడు కాస్త ఆశ్చర్యంగా.

"దక్షణాది ఇల్లాళ్ళకి స్టీలు గిన్నెలు కొనడమంటే మహా సరదా! కొట్లలో కొన్నవి కాకుండా, బట్టలతో కొనడం కూడా పెద్ద అలవాటు!" అన్నాను.

"దక్షిణాది వాళ్ళకే కాదు, దేశమంతా ఇదే అలవాటు! సరేకాని, మీ సామాను అంతా కలిపి ఎంత విలువ ఉంటుంది?"

"నలభై వేల దాకా ఉండొచ్చు" అన్నాను.

"నాలుగు శాతం ఆక్ట్రాయ్‌తో మీరు పదహారు వందలు చెల్లించవలసి వస్తుంది. నా అంచనా ప్రకారం మీ సామాను అరవై వేలకి తక్కువుండదు!" అన్నాడు సాల్వే తల పంకిస్తూ.

"నేను సామాను ఇన్సూర్ చేయించింది కూడా నలభై వేలకి" అన్నాను.

"వాటి సంగతి నాకెందుకుగాని, ఏదో అడ్జస్ట్‌మెంట్ చేద్దాంలెండి!" అన్నాడు. ఏమిటన్నట్టుగా చూశాను. "సాబ్‌కి నువ్వు చెప్పలేదా?" అని డ్రైవర్ని చూస్తూ అన్నాడు.

"ఏదీ, చెప్పబోయేలోగా మీరొచ్చేశారు!" అన్నాడు డ్రైవరు నసుగుతూ.

"సరేలే, అవతల నాకు బోల్డంత పని ఉంది, అరడజను సంతకాలయితేనే కాని మీకు పాస్ దొరకదు. మీరు మీ వస్తువుల విలువ ఇరవై వేలు వ్రాయండి. నా అంచనా పాతిక వేలని వ్రాస్తాను. అప్పుడు మీరు వెయ్యి రూపాయలు సుంకం చెల్లించుకోవలసి వస్తుంది. మాకో నూట యిరవై అడ్జస్ట్ చేయ్యండి" అన్నాడు.

నేనేదో అనబోయాను, డ్రైవరు కనుసన్నలతో వారించాడు. సరేనన్నట్టుగా తలూపాను.

వస్తువుల విలువ ఇరవై వేలని నా దస్తూరితో వ్రాయించి, పక్కనే పాతిక వేలని తన దస్తూరితో వ్రాసి సంతకం పెట్టి, ఆ ఫారం నా కిచ్చాడు. నేనిచ్చిన నూట యిరవై రూపాయల్నీ జేబులో వేసుకొని, "కిటికీ నెంబరు ఆరు దగ్గర వెయ్యి రూపాయలు చెల్లించి రశీదు తీసుకోండి. ఆ రశీదుని పదో నెంబరు కిటికీ దగ్గర చూపిస్తే పాస్ దొరుకుతుంది!" అని వెళ్ళిపోయాడు.

"ఇంతేనా, యింకా ఏమైనా అడ్జస్ట్‌మెంట్లు చెయ్యాలా?" అని అడిగాను.

"ఇంతే సార్, ఇంకేమి అక్కర్లేదు. వాళ్ళ వాటాలు వాళ్ళు చూసుకొంటారు. డబ్బివ్వండి. నేను వెళ్ళి కట్టి, పాస్ తీసుకొస్తాను" అన్నాడు. అతగాడికి డబ్బిచ్చి పంపాను. పావు గంటలో తిరిగి వచ్చి, వెయ్యి రూపాయల రశీదు నాకిచ్చి పాస్ తన దగ్గరుంచుకొని, "సార్, చూడండి పనెంత త్వరగా అయిపోయిందో!" అన్నాడు, నవ్వుతూ. క్వార్టరు ఎడ్రసు కాయితం లారీ డ్రైవరికిచ్చి, కార్వర్టర్సుకి వెళ్ళే దారి చెప్పి, జీప్‌లో కూర్చున్నాను.

తోడు తీసుకొచ్చిన జూనియర్ కొలీగ్, "సాబ్, మన కంపెనీకి ఆరు వందలు లాభం!" అన్నాడు.

"లారీ చార్జీలు, ఆక్ట్రాయ్ ఛార్జీలు అన్నీ మన కంపెనీ యిస్తుంది కదా. అందుకనే నేను వస్తువుల్ని ఎంతకు ఇన్సూర్ చేయించానో ఆ విలువ చెప్పాను. నిజానికి అతను ఆ విలువ ప్రకారమే తన అంచనా కూడా వేసినా, కాయితాలు కదలడానికి తీసుకొనేది తీసుకోక మానడు. అయితే జరిగిందేమిటంటే, మనం పనిచేస్తున్న కంపెనీకి ఆరు వందలు లాభం! ముంబయ్ మునిసిపల్ కార్పొరేషన్ వాళ్ళకి ఆరు వందలు నష్టం! మన లారీకి త్వరగా పాస్ యిచ్చి ప్రాబ్లం సాల్వ్ చేసిన పురపాలకసంఘ ఉద్యోగి సాల్వేకి నూట యిరవై లాభం. మన కంపెనీ ఉద్యోగినైన నాకు జేబులోంచి నూట యిరవై నష్టం!" అన్నాను నవ్వుతూ.

నా ఈ స్వానుభవం వల్ల, నగరపాలక సంఘాలకి రాబడి ఎందుకు తగ్గుతుందో తెలియవచ్చింది! ఆక్ట్రాయ్ పోస్టులో పోస్టింగ్ కోసం, కార్పొరేషన్ ఉద్యోగులు ఎందుకు తహతహలాడ్తారో కూడా తెలియవచ్చింది.

అయితే, స్వంత ఖర్చుల మీద, ఈ నగరానికి వలస కోసం వస్తే, ఆక్ట్రాయ్ యినస్పెక్టర్‌తో నేనే ముందుగా బేరమాడేవాణ్ణేమోనన్న ఆలోచన కలగకపోలేదు.